

# ప్రైవేట్ బడుల్లో.. భద్రత ఎంత..?

**-అపార్టుమెంట్‌లు ,ఇరుకు గదుల్లో పాఠ్యాంశాల బోధన**
**-చాలా పాఠశాలల్లో కనిపించని క్రీడా మైదానాలు**
**-రాజకీయ ఒత్తిళ్లతో అడ్డగోలుగా అనుమతులు**
**-చూసిచూడనట్లుగా విద్యాశాఖ అధికారులు**
**-అనుకోని సంఘటనలు జరిగినప్పుడే హడావిడి**
**-మరికొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాలలు**

**హైదరాబాద్,మే 29,ప్రభాతవార్త:** జూన్ వచ్చేస్తుంది..కొద్దిరోజుల్లో స్కూళ్లు మళ్లీ పున:ప్రారంభం కానున్నాయి. ఇటీవల నగరంలో చోటుచేసుకుంటన్న అగ్నిప్రమాదాల నేపథ్యంలో ప్రైవేట్ స్కూళ్ల భద్రతపై పేరెంట్స్‌కు టెన్షన్ పెట్టిస్తున్నాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలల్లో భద్రత, గతంలో జరిగిన పలు సంఘటనలను చూస్తే తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా తల్లి దండ్రులు పిల్లల భద్రత విషయం పెద్దగా పట్టించుకోకుండా పాఠశాలకు పంపుతున్నారు. ఏదైనా అనుకోని అగ్నిప్రమాదం జరిగితే వారి భద్రత ఎంత వరకు పదిలం అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే బడిలో బాల్యానికి భరోసా ఉంటుందని పలువురు విద్యారంగ నిపుణు తెలుపుతున్నారు. నగరంలో జిప్లస్ నుండి మొదలు పెడితే జీప్లస్4వరకు బహుళ అంతస్తుల్లో ప్రైవేట్ ప్రైవేట్ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. ఇరుకు గదుల్లో, కనీసం వాహనం కూడా లోపలికి వెళ్ల‌లేని ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల్లో పాఠశాలలను నిర్వహిస్తు వేలమంది విద్యార్థులను ఇరుకు గదుల్లో కుక్కుతున్నారు. దీంతో ఇలాంటి భవనాల్లో అనుకోని పరిస్థితుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే విద్యార్థులు బయటపడే మార్గాలు మాత్రం కనిపిస్తలేవు. పాఠశాలలు గుర్తింపు తీసుకునే సమయంలో, రెన్యూవల్ సమయంలో మాత్రమే ఫైర్‌సేఫ్టీ సర్టిఫికేట్ తీసుకుంటున్నారు. చాలా ప్రాంతాల్లో అధికార విపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులే యాజమాన్యాలుగా ఉడటంతో వారి నుండి వచ్చే వత్తిడితో నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది.

### నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి ..

అగ్నిప్రమాద సందర్భాల్లో ఎలా వ్యవహరించాలో చాలా విద్యాసంస్థల్లో కనీస అవగాహన కార్యక్రమాలు నిర్వహించట్లేదు. బహుళ అంతస్తుల భవనంలో విద్యాసంస్థ నడపాలంటే ఆభవనం చుట్టూ అగ్నిమాపక వాహనం ప్రయాణించే స్థలం ఉండాలి. కానీ నగరంలోని చాలా సంస్థల భవనాలు దీనికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రైవేట్ స్కూళ్లతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలలోలనే విశాలమైన భవనాల్లోనే ఉన్నాయి. అయితే వీటిల్లో వసతుల విషయానికొస్తే అరకొరగానే ఉన్నాయి. 80శాతం భవానాల్లో అగ్నిప్రమాద నివారణ పరికరాలు లేవు. గ్రేటర్ పరిధిలో 30శాతం ప్రైవేట్ స్కూళ్లు మెరుగైన వసతులతో కొనసాగుతుండగా 70శాతం పాఠశాలలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. నాలుగైదు అంతస్తుల భవనం ఉన్నప్పటికీ కనీసం విశాలమైన మెట్లు మార్గం కూడా ఉండటం లేదని, పిల్లలు ఆడుకోవడానికి కనీసం ఆటస్థలాలు కూడా అదుబాటులో లేవని ఆరోపిస్తున్నారు.



హైదరాబాద్ వార్త

# కొలువు తెచ్చిన గౌరవం..

**-ఉద్యోగంతో ట్రాన్స్‌జెండర్లలో ఆత్మవిశ్వాసం -హైడ్రా ఈగల్ టీమ్‌గా ప్రత్యేక గుర్తింపు**

**హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త:** హైడ్రాలో ఉద్యోగం..ట్రాన్స్‌ఎండర్ల జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చింది. కొలువు తెచ్చిన గౌరవం.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇక వారు వెనక్కి చూడడంలేదు. విధులు ఎక్కడైనా.. ఎప్పుడైనా సిద్ధమంటున్నారు. చెరువులు, నాలాల కబ్జాలను తొలగించడంలో భాగస్వామ్యమౌతున్నారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడంలో ముందుంటున్నారు. మొత్తం 16 మంది ట్రాన్స్‌జెండర్లకు హైడ్రా అవకాశం కల్పించింది. ఇందులో ట్రాన్స్ ఉమెన్ 11 మంది ఉంటే.. ట్రాన్స్‌మెన్ ఐదుగురున్నారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా వెరవకుండా.. విధులు నిర్వహించి ప్రజా ఆస్తులు కాపాడడంలో భాగస్వామ్యమౌతున్నారు. హైడ్రా )లో మాకు దక్కిన ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదు. మా జీవితాలకు కొత్త గుర్తింపు అని అంటున్నారు. హైడ్రా యూనీఫామ్ వేసుకోవడం గౌరవంగా భావిస్తున్నామని అంటున్నారు. "హైడ్రా ఈగల్ టీమ్"గా నామకరణం చేసి..విధుల్లో భాగస్వామ్యులను చేయడం ఎంతో సంతోషంగా ఉందని ట్రాన్స్జెండర్లు చెబుతున్నారు.



హైడ్రాఈగల్ టీమ్‌గా సేవలు..

కబ్జాదారులు ఎంతటి వారైనా.. హైడ్రా వెనుకడుగు వేయదు. హైడ్రా ఇచ్చిన ధైర్యంతో ఈగల్ టీమ్ పని చేస్తోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్‌లో 862 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడడంలో ట్రాన్స్‌జెండర్లు చురుకైన పాత్ర పోషించారు. ఇటీవల మాదాపూర్ లో ఈదులకుంట కాపాడడంలో చురుకైన పాత్రపోషించారు. ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి పరిస్థితిని సర్దిచెప్పడం, అధికారులు–ప్రజల మధ్య సమన్వయం చేయడం వంటి పనుల్లో వారు ప్రత్యేక పాత్ర పోషించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాతూమా జీవితాల్లో డబ్బుకంటే గౌరవమే ముఖ్యమైంది. ఇప్పుడు హైడ్రా యూనిఫాం వేసుకుని బయటికి వెళ్తే గౌరవంగా ఉంది. అది మా జీవితంలో పెద్ద మార్పు. అవకాశం ఇస్తే ట్రాన్జెండర్లు ఏ రంగంలోనైనా రాణిస్తారు." హైడ్రాలో మా విధులు అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. హైడ్రాలో అధికారులతో పాటు..ప్రతి ఒక్కరూ మాకు సహకరిస్తున్నారు. విధులు నిర్వర్తించడంలో సమానంగా చూస్తున్నారు.

# ముందు జాగ్రత్తతో 'వరద ముప్పు'నకు పరిష్కారం

**-కాలువల్లో డీసిల్టింగ్ పనులు వేగంగా జరగాలి**
**-వాటర్ లాగిన్ పాయింట్ల వద్ద నీరు లేకుండా చూడాలి**
**-వివిధ శాఖల సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయెల్ డేవిస్ తదితరులు

**హైదరాబాద్, మే 29,ప్రభాతవార్త:** ముందస్తు జాగ్రత్తలతో వర్షాకాలం తలెత్తే సమస్యలను చాలా వరకు పరిష్కరించవచ్చునని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. వరద నీరు సాఫీగా సాగేలా ఏర్పాట్లు చేస్తే రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించవచ్చునని చెప్పారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీస్, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, ఐఎండీ, టీజీడీపీఎస్, యూబీడీ, వాటర్ బోర్డుతో పాటు సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం సమీక్షించారు. వరద కాలువల్లో డీసిల్టింగ్ పనులు ముమ్మరంగా జరగాలని.. ఇందుకు హైడ్రా పూర్తి సహకారం అందిస్తున్నదని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 523 వాటర్ లాగింగ్ పాయింట్లుంటే.. ఇందులో 105 వరకూ మేజర్, 157 మీడియం, 261 మైనర్‌వి ఉన్నాయన్నారు. ఇక్కడ నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. రహదారులపై నీరు నిలిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని.. దీంతో గంటల తరబడి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వర్షాకాలం ఆరంభం నాటికే సమస్యలు పరిష్కారం జరగాలని ఇందుకు గాను ఆయా శాఖలు ఏవిధంగా ప్రయత్నిస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలతో హైడ్రా సమన్వయంగా పని చేసి.. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎక్కడైనా ఇబ్బందులంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చెట్లు విరిగి పడి రహదారులపై ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం ముందుగానే వాటిని గుర్తించి పరిష్కరించాలన్నారు. నగరంలో ఉన్న జలాశయాల్లో నీటి నిలువలను తగ్గించి ఉంచేలా ఇరిగేషన్ విభాగం చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే వరద నీరు సాఫీగా చెరువుల్లోకి చేరుతుందన్నారు. ఇలా వరద నివారణ చర్యలు మరియు అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థలపై విస్తృతంగా చర్చించారు. వివిధ శాఖలు చేసిన సూచనలమేరకు సమస్యలు పరిష్కారానికి జీహెచ్ఎంసీ చర్యలు తీసుకుంటుందని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్ తెలిపారు. వర్షాకాలం తలెత్తే ట్రాఫిక్ సమస్యలను జాయింట్ సీపీ ట్రాఫిక్. జోయెల్ డేవిస్‌తో పాటు.. ఆ విభాగం డీసీపీలు, ఏసీపీలు వివరించారు. పోలీసు స్టేషన్‌కు అనుసంధానంగా మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లు అందుబాటులో ఉంచాలని కోరారు. అంతకు ముందు గతేడాది నగరంలో తలెత్తిన సమస్యలపై హైడ్రా అడిషనల్ డైరెక్టర్ పాపయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గతేడాది జరిగిన నాలాల విస్తరణ, పూడిక తీత పనులు జరిగిన తీరును తెలిపారు.

# సింగూర్‌లో అత్యవసర పంపింగ్ ఏర్పాటు

**-పనులను వేగవంతం చేయాలన్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి**

**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త** హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగూర్ రిజర్వాయర్ పరిధిలో చేపడుతున్న అత్యవసర పంపింగ్ ఏర్పాట్లపై జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి ఆరాదీశారు. పటాన్‌చెరు ట్రాన్స్మిషన్ డివిజన్ 2 పరిధిలో జరుగుతున్న ఎమర్జెన్సీ పంప్‌సెట్ అలైన్‌మెంట్ పనులను సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షించారు. సింగూర్ జలాశయంలో ప్రస్తుతం నీటి మట్టం 516.080 అడుగులుగా ఉండగా, అందుబాటులో ఉన్న నీటి నిల్వ సామర్థం 5.477 టీఎంసీలుగా నమోదైంది. జూన్ 1, 2026 నుంచి అత్యవసర పంపింగ్‌ను పాక్షిక స్థాయిలో ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ఎండీకి వివరించారు. రిజర్వాయర్ 516.00 అడుగుల నీటి మట్టం వద్ద సుమారు 5.340 టీఎంసీల నీటి నిల్వ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అత్యవసర పంపింగ్ వ్యవస్థను సకాలంలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పంప్‌సెట్ అలైన్‌మెంట్, విద్యుత్ సరఫరా, మెకానికల్‌లతో పాటు ఎలక్ట్రికల్ అంశాలన్నింటినీ సమన్వయంతో పూర్తి చేసి, అత్యవసర పంపింగ్‌ను నిర్దేశిత గడువులో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వ్యవహరించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి దశలో పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.



సింగూర్‌లో అత్యవసర పంపింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

# మల్కాజిగిరి సిపి సుమతి పేరుతో ఫేక్ అకౌంట్..

**-సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి 20వేలు బురిడీ కొట్టించిన సైబర్ చీటర్స్**





**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త** పోలీసు ఉన్నతాధికారుల డీపీలు ఉపయోగించి మోసం చేస్తున్న ఘటనలు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. మల్కాజిగిరి సీపీ సుమతి పేరుతో సైబర్ నేరగాళ్లు ఘరానా మోసానికి పాల్పడ్డారు. ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్ తెరిచి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించారు. తాజాగా జరిగిన ఘటనలో తానే కమిషనర్‌నంటూ ఫేస్‌బుక్‌లో ఓ సైంటిస్ట్‌ను సైబర్ నేరగాళ్లు పరిచయం చేసుకొని, తన స్నేహితుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు, ఫర్నిచర్ అమ్ముతున్నాడంటూ నమ్మించి రూ.20 వేలు సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ కొట్టించారు. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పేరు, ఫొటోతో సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్ ఖాతాను తెరిచి కొందరికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించారు. రామంతాపూర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి కూడా ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. తనకు పోలీస్ కమిషనరే ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించారని భావించిన బాధితుడు రిక్వెస్ట్‌కు ఒకే చెప్పాడు. రెండు రోజుల తరువాత బాధితుడి వాట్సాప్ నెంబర్‌కు తాను ఐపీఎస్ అధికారి సుమతి అంటూ మేసేజ్ వచ్చింది. ఐపీఎస్ అధికారిగా చెప్పుకుంటూ చాటింగ్ చేస్తున్న వ్యక్తి.. తన స్నేహితుడు సంతోష్‌కుమార్ సీఆర్‌పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తున్నాడు, అతడికి బదిలీ కావడంతో ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌ను విక్రయిస్తానంటున్నాడంటూ మేసేజ్ పంపించారు. మీకు సదరు వ్యక్తి ఫోన్ చేస్తాడని, ఏదైనా ఉంటే అన్నింటికి తాను బాధ్యత వహిస్తానంటూ నమ్మించారు. బాధితుడికి తరువాత సంతోష్‌కుమార్ పేరుతో మేసేజ్‌లుపెట్టి, ఫర్నిచర్ ఫోటోలు పంపించారు. రూ.85 వేలకు మొత్తం ఫర్నిచర్‌ను విక్రయిస్తానంటూ చెప్పడంతో బాధితుడు రూ.20 వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. ఇదంతా మోసమని గుర్తించి బాధితుడు వెంటనే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఎంఐఎం ఆధ్వర్యంలో ఈద్ మిలాప్





ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎఐఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు

**చార్మినార్,మే 29 ప్రభాతవార్త :** ఎఐఎంఐఎం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి దారుసలాంలోని ఎఐఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఈద్ మిలాప్ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ,చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ,బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్,నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్,యాకుత్‌పుర ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహరాజ్,మాజీ శాసన సభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్,ఎంఐఎం ఎమ్మెల్సీలు మీర్జా రెహ్మత్ బేగ్,మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎ ఆఫెందీ,ముస్లిం మత గురువులు,మాజీ ఎంఐఎం కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పోష్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి**



అవగాహన కార్యక్రమానికి హాజరైన వారితో అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి

**హైదరాబాద్,మే 29,ప్రభాతవార్త:** జిల్లాలో పోష్‌చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ జితేందర్ రెడ్డి అన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక – ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, హైదరాబాద్ జిల్లా సంక్షేమ కార్యాలయం ఆధ్వర్యంలో మహిళల సాధికారత కోసం జిల్లా హబ్ కార్యాలయం, పనిస్థలాల్లో పోష్ చట్టం అమలు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పనిస్థలాలను కల్పించడం ఎంత ముఖ్యమో వివరించారు. వనరుల కల్పన పై రోహిణి చౌదరి పోష్ చట్టంలోని నిబంధనలు, ఫిర్యాదు వ్యవస్థలు, అంతర్గత కమిటీల బాధ్యతలు, మహిళా ఉద్యోగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన రక్షణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం సందర్భంగా మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వాష్ రూమ్ సమస్యను ప్రస్తావించారు. నైటింగేల్ హోమ్ ఫర్ గర్ల్స్ విద్యార్థినులు తమ అనుభవాలను తెలియజేస్తూ, ఈ కార్యక్రమం ద్వారా మహిళల హక్కులు, పనిస్థల భద్ర తపై అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు పావని, రేణుక, కృష్ణ చైతన్య, పుష్పవతి, డాక్టర్ స్వప్న, సూపర్వైజర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, స్థానిక కమిటి సభ్యులు, సఖి అలాగే డిసిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో సామూహిక లలితా సహస్ర నామార్చన



**బేగంపేట మే 29, ప్రభాతవార్త** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో శుక్రవారం సామూహిక లలితా సహస్రనామార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా మణిద్వీప వర్ణన పారాయణము, కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు.

# ఎంఎంసిలో నీటి నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు

**-మూసీ నదిలో లార్వా సాంద్రత సున్నా : కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**



అధికారులకు సూచనలు ఇస్తున్న కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, మే 29 ప్రభాతవార్త :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు.శుక్రవారం నాగోల్, నేతాజీ నగర్, శృంగేరి కాలనీ, ఈస్ట్ యాదవ్ నగర్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా నాగోల్ బ్రిడ్జి సమీపంలోని మూసీ నదిని పరిశీలించి లార్వా సాంద్రతను తనిఖీ చేయగా సున్నాగా నమోదైనట్లు తెలిపారు. దోమల నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు.అనంతరం ఈస్ట్ యాదవ్ నగర్‌లోని వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. శృంగేరి కాలనీలో జీవీపీ తొలగించిన ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణలను పూర్తిగా తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించిన సిబ్బంది పనితీరును ప్రశంసించారు.నేతాజీ నగర్‌లోని వరద నీటి కాలువలను పరిశీలించిన కమిషనర్, రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త, మురుగును వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుధ్య చర్యలను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

**ఎంఎంసిలో స్టాండింగ్ కమిటీ సమావేశం.....** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ అండ్ స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో మొత్తం 30 అజెండా అంశాలపై చర్చించారు. ప్రజా సేవల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, డ్రైనేజీ, రహదారులు, క్రీడా మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశంలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, పారిశుధ్య అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, పరిపాలన అదనపు కమిషనర్ వేణుగోపాల్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇళ్ల ముందు డ్రైనేజి వ్యర్థాలు రాకపోకలకు ఇబ్బందులు

**-నెలలుగా ఇదే సమస్యతో ఇళ్ల ముందు నిల్చి ఉన్న మురుగు..ఇబ్బంది పడుతున్న స్థానికులు**



మాతాజీ నగర్‌లో రాకపోకలకు అంతరాయంగా మారిన డ్రైనేజీ నీరు.

**బేగంపేట, మే 29,ప్రభాతవార్త** డ్రైనేజీ పొంగి పొర్లుడాయె.రాకపోకలకు అంతరాయమాయె.అన్నట్లు పరిస్థితులు నెలకొని ఉన్నా సంబంధిత శాఖాధికారులు కళ్లుండి చూడలేని పరిస్థితి బేగంపేట డివిజన్ లో నెలకొని ఉంది.ఇదే సమస్య నెలలుగా వివిధ ప్రాంతాల్లో ఉన్నా,అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.డ్రైనేజీ వ్యర్థాలు రోడ్లపై నిల్చిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.ఓల్డ్‌పాటిగడ్డలోని 1.8.547నివాసం ముందు ఈ సమస్య నెలలుగా ఉన్నా సంబంధిత శాఖ అధికారులు గానీ,సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు మురుగు నీరు రోడ్డంతా నిల్చిపోయి ఉంటున్నాయని దీంతో చిన్నారులు,మహిళలు,వృద్దులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.దీంతో పాటు మురుగు నీటిలో దోమలు కూడా పెద్ద ఎత్తున నిల్చి రాత్రి సమయంలో విపరీతంగా దాడిచేస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు.ఇదే విధంగా మాతాజీ నగర్‌లో ఇంటి నెంబరు 1.10.387బై 17బై19బి ఇంటి ముందు నిల్చిన డ్రైనేజీ నీటితో బాలింతలు,వృద్దులు,పిల్లల తల్లులు దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొని ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల స్థానికులు సంబంధిత శాఖకు ఫిర్యాదులు చేసినప్ప టికీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థాని కులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబం ధిత శాఖ ఉన్నతాధికారులు గానీ ప్రజాప్రతి నిధులు గానీ స్పందించి పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, ఓల్డ్ పాటిగడ్డ, మాతాజీనగర్ వాసులు కోరుతున్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం : ఎమ్మెల్యే కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 28, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ హెచ్.ఐ.జి వద్ద 14 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నూతన పైప్లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత నాదని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిదులు కొరత లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతినిత్యం ఏదో ఒకచోట శంకుస్థాపన నిర్వహించేవారమని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరాలైనా కూడా నియోజకవర్గానికి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం లేదని అరకొర నిధులతో అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అఖండ మెజారిటీతో మూడుసార్లు గెలిపించిన ప్రజల రుణం ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సరే ఓర్చుకుని ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, బిక్షపతి, బి.ఆర్.ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## చేయూత యాప్ నమోదు కార్యక్రమం..



వివరాలు సేకరిస్తున్న దృశ్యం

**కూకట్‌పల్లి, మే 28, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వ రూపొందించిన చేయూత యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు ఫోటోలు సేకరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసెర్స్ పర్సన్ జానకి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు.

## డాక్టర్ లక్ష్మణ్‌కు బిజెపి నేతల సన్మానం



రాజ్యసభ హౌస్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ లక్ష్మణ్ సన్మానిస్తున్న దృశ్యం

**బేగంబజార్,మే 29ప్రభాతవార్త:** రాజ్యసభ హౌస్ కమిటి చైర్మన్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యులుడాక్టర్ లక్ష్మన్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు,మహేష్‌బ్యాంకు వైస్ చైర్మన్ గోవింద్‌రాఠి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈమేరకు డాక్టర్ లక్ష్మన్ శాలువ కప్పి సన్మానించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కోసం అంకిత భావంతో పని చేసే వారికి తప్పకుండా పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం ఇవ్వకుండా కరెంట్ కట్ చేసిన చుడీబజార్ సెక్షన్ సిబ్బంది



కరెంట్ కట్ చేయడంతో అడ్డుకున్న స్థానికులు

**అఫ్జల్‌గంజ్,మే 29ప్రభాతవార్త:** పెరుగుతున్న ఎండ వేడిమి తట్టుకోలేక ఓవైపు ఉంటున్న సందర్భంలోచుడీబజార్ విద్యుత్ శాఖ ఎ.ఇ పరిధిలోని అధిక కరెంటు బకాయిలు ఉన్నాయని చెప్పపెట్టకుండా విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు.దీంతో చుడీబజార్,ఊట్‌వాడి బస్తీ పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ బిల్లులు బకాయిలుఉన్నట్లు సాకు చూపి విద్యుత్ సిబ్బంది కరెంట్ కట్ చేసినట్లు స్థానికులు వాపోతున్నారు.విపరీతమైనఎండలు ఉన్నప్పటికి ఇండ్లలో ఆకస్మాత్తుగా వచ్చి కరెంట్ వైర్లను తొలగించి ఇబ్బందుల పాలుచేస్తున్నారనివాపోతున్నారు.విద్యుత్‌శాఖ సిబ్బంది ఏకంగా గడువు ఇవ్వకుండా కరెంట్ చేయడం ఎంత వరకు సమంజసమని విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకునిమొండి బకాయిలు ఉంటే వాయిదా పద్దతిలో కరెంట్ బిల్లులను చెల్లించే విధంగా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## జూన్ 7న బాలల జాతీయ స్థాయి ప్రతిభోత్సవాలు

**చిక్కడపల్లి మే 29 ప్రభాతవార్త :**

అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 7వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల జాతీయ స్థాయి ప్రతిభోత్సవము 2026 నిర్వహించనున్నట్లు స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ ఇ. సూర్యతేజసుబ్రాంత్ మాస్టర్ , వ్యవస్థాపకులు ఈ ఎస్. సూర్యనారాయణ మాస్టర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో బాలబాలికల్లో దాగి ఉన్న విభిన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఈ వేదికను కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంగీతం (లలిత గీతాలు, కీర్తనలు, దేశభక్తి గేయాలు, జానపద, సినిమా పాటలు), మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (గిటార్, కీబోర్డ్, డ్రమ్స్, తబలా, మృదంగం, వయొలిన్), నృత్యం (కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఆంధ్రనాట్యం, పేరిణి, జానపదం, వెస్ట్రన్), సోలో, డ్యూయెట్, గ్రూప్స్, మిమిక్రీ, మ్యాజిక్, ఏకపాత్రాభినయం, కరాటే, కుంగ్ఫు వంటి పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో పోటీలు ఉంటాయని వివరించారు. గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్ల ప్రధానం: ఈ ప్రతిభోత్సవంలో పాల్గొన్న బాలబాలికలందరికీ ప్రత్యేక ప్రోత్సాహకంగా సర్టిఫికెట్, గోల్డ్ కోటెడ్ మెమెంటో (గోల్డ్ మెడల్) అందించి సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనదలచిన 4 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులు లేదా గురువులు తమ వివరాలను జూన్ 4వ తేదీ లోపు 7893940600 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## రోడ్డు దాటుతున్న మహిళకు గుండెపోటు...సిపిఆర్ చేసినా దక్కని ప్రాణాలు

**బేగంపేట మే 29,ప్రభాతవార్త**

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లో రోడ్డు దాటుతున్న ఓ మహిళకు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు.ఇది గమనించిన స్థానికులు,అక్కడ విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది.తిరుమల గిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు మహిళకు సీపీఆర్ చేసి సకాలం(గోల్డెన్ హవర్)లో ఆసుపత్రికి తరలించినా మహిళ ప్రాణాలు కోల్పోయింది.ఈ సంఘటన బేగంపేట లో శుక్రవారం జరిగింది. పొట్ల లావణ్య అనే మహిళ శ్యాంలాల్ బిల్డింగ్ ఎదురుగా భారత్ పెట్రోలు పంప్ వద్ద రోడ్డు దాటుతుంది.ఇదే సమయంలో ఆమె గుండె పోటుకు గురయ్యారు.ఇది గమనించిన స్థానికులు ఆమెను పెట్రోలు పంప్ ఆవరణలోకి తరలించారు.అదే సమయంలో ఆప్రాంతంలో క్రేన్ డ్యూటీలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది పీసీ 3759భరత్,పీసీ 2519మన్మధరావు(మొబైల్1)ఆమెకు సీపీఆర్ నిర్వహించారు.విషయం తెల్సుకుని అక్కడికి చేరుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సీపీఆర్ చేయడంతో



రోడ్డు దాటుతూ గుండె పోటుకు గురై మృతి చెందిన మహిళ.

పాటు అంబులెన్స్‌రాక పోవడంతో తన వాహనంలో మహిళను కిమ్స్‌సన్‌షైన్ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరిక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు.సకాలంలో స్పందించిన స్థానికులను,ట్రాఫిక్ సిబ్బందిని ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు అభినందించారు. స్థానికులు కూడా సకాలంలో స్పందించిన ట్రాఫిక్ ఏసీపీ,సిబ్బందిని,అక్కడ ఉండి సహాయం అందించిన వారిని అభినందించారు.

## మానవతకు మారు పేరు కృష్ణ : సినీ దర్శకుడు నరసింహారావు

**చిక్కడపల్లి మే 29 ( ప్రభాతవార్త ) :** ఎట్టి స్థాయిలో మనిషి నైనా గౌరవించే కృష్ణ మానవత కు మారు పేరు అని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (, ఇండియా,), శ్రీ కృష్ణ స్వర రాగ స్రవంతి నిర్వహణలో విఖ్యాత నటుడు కృష్ణ జయంతి సందర్భంగా ఆయన మేకప్ మన్ చేబ్రోలు మాధవ రావు కు సత్కారం జరిగింది ముఖ్య అతిథి గా పాల్గొన్న రేలంగి నరసింహారావు సత్కారం చేసి మాట్లాడారు కృష్ణ నిర్మాతల కష్టసుఖాలు తెలిసిన ఉత్తమ వ్యక్తిత్వం కల వారని చెప్పారు మాధవ రావు అరవై సంవత్సరాలు కృష్ణ కు పర్సనల్ మాకప్ మాన్ గా ఉన్నా ఆత్మీయ మిత్రుడు గా భావించారని వివరించారు వంశీ సంస్థ తెరవెనుక ఉన్న సాంకేతిక నిపుణులు ను గుర్తించి సత్కరించటం అపురూపం అన్నారు మాధవ రావు మాట్లాడుతూ కృష్ణ కి తొలి మేకప్ వేసింది మొదలు చివరి సినిమా వరకు పని చేశాను అని చెప్పారు ఒకసారి అభిమానం కలిగితే కృష్ణ వారిని వదలరని



మేకప్ మన్ చేబ్రోలు మాధవ రావును సత్కరిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు

తెలిపారు వంశీ రామరాజు అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు వై ఎస్ రామ కృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భం గా కృష్ణ పి ఆర్ ఓ బాలాజీ శర్మ, కృష్ణ మహేష్ సేన అధ్యక్షుడు మల్లేశ్ గంటి సాయిజీ తదితరులు సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ చేశారు తోలుత కృష్ణ నటించిన సినిమా లలో పాటలు లక్ష్మి శారద రెడ్డి రామ కృష్ణ తదితరులు మధురంగా ఆలపించారు.

## కమ్యూనిటీ హాల్ పనులను వేగవంతం చేయాలి : పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి మే 29 ( ప్రభాతవార్త ) :**

గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బాపునగర్ యూత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను శుక్రవారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్ కుమార్ పరిశీలించారు. గతంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్ నిధులు రూ.1 కోటితో చేపట్టిన డివిజన్ అభివృద్ధి పనులలో భాగంగా, రూ.9 లక్షల వ్యయంతో అరుంధతి నగర్ బస్తీ కమిటీ హాల్, చిక్కడపల్లి, బాపునగర్ యూత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ రెన్నోవేషన్ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎ.పావని వినయ్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ మరమ్మత్తు పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి, స్థానిక ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తెచ్చేలా ఇంజనీరింగ్ అధికారులు



కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్ రావు, సాయి గౌడ్, బస్తీ నాయకులు రాజు, రేవంత్, ఉదయ్, సాయి తేజ, క్రాంతి, భాగ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదప్రజలే నాదేవుళ్లని చెప్పిన ఏకైన నాయకుడు ఎన్టీ రామారావు : బండారు దత్తాత్రేయ

**నాంపల్లి, మే 29 ప్రభాతవార్త :** పద్మశ్రీ డా. ఎన్.టి.రామారావు తెలుగుజాతికి, తెలుగుభాషకు ప్రపంచవ్యాప్తంగా ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చిన మహానుభావుడని హరియాణా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. పేదప్రజలే నాదేవుళ్లని చెప్పిన ఏకైన రాజకీయ నాయకుడు ఎన్టీరామారావు ప్రజల సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంలో ఎన్ని ప్రజాహిత పథకాలను ప్రవేశపెటి ఆదుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌మీద అద్భుతం, కళాత్మకంగా ఏర్పాటు చేసిన మన సాహిత్యం, కళలు, చరిత్ర, మహాపురుషుల విగ్రహాలను ప్రతిష్టించి హైదరాబాద్ నగరంతోపాటు యావత్ తెలుగుజాతికే గొప్ప పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చారని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఇలాంటి నాయకులు చాలా అరుదని చెప్పారు. ట్రస్టు చేస్తున్న వివిధ సేవలు ఎనలేనివి, అనితరసాధ్యమని కమలాకరభారతి, సంస్థను అభినందించారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షోపన్యాసంలో మే 28 ఎంతో మహానుభావులైన ముగ్గురు త్రిమూర్తులు ఒకరు సురవరం ప్రతాపరెడ్డి, మరొకరు స్వాతంత్ర్యయోధుడు వీర సావర్కర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావుల పుట్టినరోజుని గుర్తుచేశారు. ముగ్గురూ భౌతికంగా లేకపోయినా వారి అడుగుజాడలున్నాయని, కళా సాహిత్య నైపుణ్య, ధీరత్వం వారివని, మనందరికి ఆచరణ స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. కమలాకర మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా.



సకలకళల భారతీయ గ్రంథావిష్కరణ కావిస్తున్న బండారు దత్తాత్రేయ, వెంకటరెడ్డి, కృష్ణకుమారి, కమలాకర భారతి తదితర అతిథులు

నందమూరి తారక రామారావు కళావేదికలో సంస్థ 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖకవి, ధర్మప్రచారకుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ ఆత్మీయ అతిథులు డా. కె.వి.కృష్ణకుమారి(సీతక్క), పి.శ్యామలాదేవి, కమలాకర భారతి, వెంకటాచార్యులు, సిహెచ్.ఆదినారాయణ, బి.రాజేంద్రబాబు తదితరులతో కలిసి పద్మశ్రీ డా. ఎన్.టి.రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి ముందుగా కమలాకర ట్రస్ట్ 39వ వార్షిక ప్రత్యేక సంచిక సకల కళల భారతీయ గ్రంథాన్ని ఆవిష్కరించి అనంతరం వివిధరంగాల్లో విశేష సేవలందిస్తున్న ప్రముఖులు ఆరుగురికి ఎన్.టి.ఆర్ స్మారక పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. సభకుముందు ప్రముఖ కళాకారుల వినోద కార్యక్రమాలు ఆహుతులను ఆహ్లాదపరిచి తన్మయుల్ని చేశాయి.

## పినరయి విజయన్‌పై ఈడీ దాడులు కేంద్ర ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపే : దండి వెంకట్

**చిక్కడపల్లి మే 29, ప్రభాతవార్త :** దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ సంస్థలను బీజేపీ కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా దుర్వినియోగం చేస్తోందని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులను లొంగదీసుకోవడానికి ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించడం అత్యంత ప్రమాదకర పరిణామమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నల్లకుంటలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో దండి వెంకట్ మాట్లాడారు. పినరయి విజయన్ లక్ష్యంగా ఈడీ పేరిట జరుగుతున్న రాజకీయ దాడులను తమ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు రాజకీయంగా ఎదురు నిలిచే వామపక్ష శక్తులను, ప్రజాస్వామ్యవాదులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇటువంటి కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశంలో మైనారిటీలు, బహుజనులపై జరుగుతున్న దాడులు, పెరుగుతున్న నిరుద్యోగం, ఆకాశాన్నంటుతున్న ధరలు, రైతాంగ సంక్షోభం వంటి కీలక ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని కేంద్ర ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన దాడులకు తెగబడుతోందని దండి వెంకట్ ఆరోపించారు. కేరళలో ప్రజా సంక్షేమ పాలన అందించిన వామపక్ష నాయకత్వంపై రాజకీయ కక్షసాధింపుతో వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటిదన్నారు. “దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఇటువంటి రాజకీయ వేధింపులు, మోసపూరిత వైఖరిపై ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, బహుజన వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలి దండి వెంకట్ పిలుపునిచ్చారు.

## నాచారం ఇందిరానగర్‌లో సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన సాయిజన్ శేఖర్

**నాచారం, మే 29 ప్రభాతవార్త :**

నాచారం ఇందిరానగర్ రోడ్ నెంబర్1లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. జరుగుతున్న పనులను స్థానిక బస్తీవాసులతో కలిసి బీఆర్ఎస్ నాయకుడు సాయిజెన్ పరిశీలించారు.ఈ సందర్భంగా సాయిజెన్ మాట్లాడుతూ ఇందిరానగర్ చిన్న బ్రిడ్జి నుంచి ఎడమవైపు మొదటి లైన్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఇదే కాంట్రాక్టర్ ద్వారా ఇందిరానగర్‌లోని నోబుల్ స్కూల్, ఇంద్ర స్కూల్ పరిసర ప్రాంతాల్లో కూడా కొత్త సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు



పనులను పరిశీలిస్తున్న సాయిజన్ శేఖర్

తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేకల ముత్యం రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, ఆశు, అమీర్, దేవులపల్లి యాదగిరి, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసరాలకూ నీళ్లు లేవ్..!

**-ఇచ్చేది పది నిమిషాలు..**
**-ఏ రోజు ఏ సమయానికి వస్తాయో తెలియని అయోమయం**
**-షిఫ్ట్ ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర అసౌకర్యం**
**-నెలల తరబడి లీకేజీలు**
**-ఇష్టారాజ్యంగా పంప్ ఆపరేటర్ల తీరు**



**అత్తాపూర్ మే29, ప్రభాతవార్త :**

వేసవి తాపానికి రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. శివరాంపల్లి బీకర్ సెక్షన్ కాలనీ, ప్రశాంత్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, బుద్వేల్ రైల్వే స్టేషన్, నేతాజీ నగర్, గగన్‌పహడ్ ,బండ్లగూడ జాగిర్ తదితర ప్రాంతాల్లో బోర్లు మొరాయించడంతో కనీసం నిత్యావసరాలకు కూడా నీళ్లు లేక స్థానికులు నానా తంటాలు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో కొన్ని బస్తీలు,కాలనీలలో సుమారు 20 నుండి 30 వరకు నూతన బోర్లు తవ్వినట్లు సమాచారం . గ్రేటర్ పరిధిలో రోజు విడిచి రోజు నీటి సరఫరా విధానం ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఏ రోజు ఏ సమయానికి నీళ్లొస్తాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఉదయం, మరికొన్ని చోట్ల సాయంత్రం, అర్ధరాత్రి నీటిని సరఫరా చేస్తున్నారు. వేకువజామునే విధులకు వెళ్లే పేదలు, షిఫ్ట్ ఉద్యోగులు నిర్దిష్ట సమయం లేకపోవడం వల్ల తాగేందుకు కూడా నీళ్లు పట్టుకోలేకపోతున్నారు.

**లోప్రెషర్ తలనొప్పులు**

వచ్చే కొద్దిపాటి నీరు కూడా కేవలం 10 నుండి 20 నిమిషాలు మాత్రమే, అది కూడా లోప్రెషర్‌తో రావడంతో నీళ్లు చాలీ చాలక జనం మండిపడుతున్నారు. ఈ సమస్యలపై పంప్ ఆపరేటర్లను ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల మంచినీటి పైపులైన్లు లీకేజీలు అవుతున్నా జలమండలి అధికారులు నెలల తరబడి మరమ్మతులు చేయడం లేదు.

**నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకం**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో వెలుస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాల కోసం వాల్టా చట్టాన్ని ఉల్లం ఘించి విచ్చలవిడిగా బోర్లు తవ్వుతున్నారు. నిర్మాణ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా నీటిని తోడేస్తుండటం వల్లే చుట్టు పక్కల కాలనీల్లో భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయని,అధికారులు దీనిపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జలమండలి అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంప్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో తిష్టవేసిన సిబ్బందిని వెంటనే వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

## చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు.. 20 తులాల బంగారం స్వాధీనం

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:**

దొంగతనాలు చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్థుడిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేసి దాదాపు రూ.20 లక్షల విలువ జేసే 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని కటకటాల వెనక్కి పంపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ సుధాకర్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బాలాపూర్ సమీపంలోని షాహిన్‌నగర్ బిస్మిల్లా కాలనీ గ్రీన్ సిటీ ప్రాంతానికి చెందిన ప్లంబర్ హబీబ్ అహ్మద్ అలియాస్ చోటు (37) దొంగతనాలు చేస్తుంటాడు. అయితే గత ఏప్రిల్ నెల 14న డ్రీమ్ లేక్ కాలనీలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు రావడంతో రంగంలో దిగిన ఇన్స్‌పెక్టర్ సుధాకర్, డిఎస్ఐ కోటేశ్వర్‌రావులు రెండు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించారు. దీంతో బాలాపూర్ ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో అనుమానస్పదంగా వెళ్తున్న హబీబ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో రూ.20 లక్షల విలువ జేసే 14 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుండి రూ.18 వేలకు బంగారు గొలుసును కొన్న మహమ్మద్



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపిస్తున్న బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్: వెనుక మాస్క్ ధరించిన వ్యక్తి నిందితుడు హబీబ్

హుస్సేన్ వద్ద నుండి దానిని స్వాధీనం చేసుకొని అతనిపై కూడా కేసును నమోదు చేశారు. కాగా నిందితుడు హబీబ్‌పై 60 కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో నిందితులిద్దరినీ రిమాండ్‌కు పంపారు. చోరీ కేసును ఛేదించిన బాలాపూర్ ఇన్స్‌పెక్టర్, డిఎస్ఐ, పోలీసులను ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్ రెడ్డి అభినందించారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నృత్యోత్సవం

**చిక్కడపల్లి మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2, తేదీన 3, వ తేదీన రెండు రోజుల పాటు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో సృజన కల్చరల్ అండ్ లిటరరీ ఆర్గనైజేషన్ నిర్వహణలో మాదాపూర్ లోని శిల్పారామం లో నృత్యోత్సవం నిర్వహిస్తున్నామని సంస్థ చైర్ పర్సన్ అంజనా చౌదరి కార్యదర్శి రమ్య కోశాధికారి సుధీర్ పుంజాల పత్రికా విలేకరులకు తెలిపారు ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి రమేష్ అగర్వాల్ ప్రారంభించగా సాంస్కృతిక పర్యాటక ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ డి జి పి సౌమ్య మిశ్రా తదితరులు పాల్గొంటారు రెండవ రోజు ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనగా ప్రభుత్వ సలహాదారులు వి హనుమంత రావు శాంతి కుమారి ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ లు అతిధులుగా హాజరు అవుతారు రెండు రోజుల నృత్యోత్సం లో వివిధ రాష్ట్రాలకి చెందిన ప్రముఖ శాస్త్రీయ జాన పద నృత్య కళాకారుల ప్రదర్శన ఉంటాయని వారు తెలిపారు.

## వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం

**చిక్కడపల్లి మే 29 ( ప్రభాతవార్త ) :** చిక్కడపల్లి స్థానిక వివేక్‌నగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి వివరించారు. శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ యజ్ఞంలో భాగంగా శ్రీమత్ సుందరకాండ హోమముతో పాటు 108 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీసా హోమము, చండీ నవశతి హోమము, శ్రీ రుద్ర హోమము, హనుమత్ కార్యసిద్ధి హోమము, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. జూన్ 1 న ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, శ్రీమత్ సుందరకాండ హోమము. సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాలపూజ, శ్రీరుద్రహోమము, రాజోపచార పూజ (చతుర్వేద అవధానాలు), 2న శ్రీ హనుమత్ కార్యసిద్ధి హోమము, 3న నవగ్రహ హోమము, 4న మేధా దక్షిణామూర్తి , దత్తాత్రేయ హోమము, 5న శ్రీ చండీ సప్తశతి హోమము, 6న 108 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీ సా హోమము, 7న పూర్ణాహుతి, మంటపోద్వాసన, మహదా శీర్వచనము, ఋత్విక్ సన్మానము, అతిథి సత్కారము, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి దైవకృపకు పాత్రులు కావాలని కోరారు.

## ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకుంటున్నారు



మౌలానా సయ్యద్ బర్కత్ అలీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,మే 29 ప్రభాతవార్త :**

ప్రజలు కలిసి మెలిసి ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని సీనియర్‌బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు.బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆయన మౌలానా సయ్యద్ బర్కత్ అలీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ పండుగలను ప్రజలు ఐకమత్యంతో నిర్వహించుకుంటున్నారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మహిళా న్యాయవాదిపై దాడి, కేసు నమోదు

**జూబ్లీహిల్స్, మే 29, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో ఓ మహిళా న్యాయవాదిపై దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఒక మహిళా న్యాయవాది తన భర్త, అత్తలతో కలిసి కేబీఆర్ ఉద్యానవనం సమీపంలోని క్రీమ్‌స్టోన్ ఐస్‌క్రీం స్టోర్ వద్దకు వచ్చారు. అదే సమయంలో ఒక వ్యక్తి ఫొటోలు తీస్తుండటంతో ఆమె ప్రశ్నించగా సైబరాబాద్ కమిషనర్‌కు పంపుతున్నట్లు సమాధానమిచ్చాడు. అనంతరం హుమేరా వార్సీ అనే మహిళతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆమె కుటుంబ సభ్యులపై సిగరెట్ పొగను ఊదుతూ అసభ్యంగా ప్రవర్తించారు. అదే సమయంలో హుమేరా వార్సీ మహిళా న్యాయవాదిని చెంపపై కొట్టింది. అక్కడున్న వారు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. జరిగిన సంఘటనపై మహిళా న్యాయమాది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జొమాటా డెలివరీ బాయ్‌పై కత్తితో దాడి

**జూబ్లీహిల్స్, మే 29, ప్రభాతవార్తః**

జొమాటో డెలివరీ బాయ్‌పై షావర్మా కత్తితో దాడి చేసిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన విద్యార్థి అయిన ప్రశిక్(25) ప్రస్తుతం బాల్కంపేట్‌లో నివాసం ఉంటూ పార్ట్‌టైమ్‌గా జొమాటో ఫుడ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ రాత్రి సుమారు 8:20 గంటలకు సోమాజిగూడలోని లక్కీ మల్టీ క్యూజిన్ రెస్టారెంట్ నుంచి ఫుడ్ పికప్ ఆర్డర్ రావడంతో అక్కడికి వెళ్లాడు. రాత్రి 8:30 గంటల సమయంలో రెస్టారెంట్‌కు చేరుకున్న ప్రశిక్, ఆర్డర్ సిద్ధమైందా అని షావర్మా సెక్షన్‌లో పనిచేస్తున్న వ్యక్తిని అడిగాడు. 15 నిమిషాలు వేచి ఉండాలని చెప్పడంతో దాదాపు 20 నిమిషాలు వేచి చూసిన తర్వాత సమయం ఆలస్యమవుతోందని మరోసారి ఆర్డర్ గురించి ప్రశ్నించగా, ఆ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇంకా వేచి ఉండాలన్నాడు. తనతో మర్యాదగా మాట్లాడాలని ప్రశిక్ కోరగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి ఒక్కసారిగా షావర్మా కత్తితో ప్రశిక్‌పై దాడి చేసి చేతులతో తోసివేశాడని తెలిపారు. ఈ దాడిలో ప్రశిక్ మెడ భాగంలో గాయాలు కావడంతో పాటు తల వెనుక భాగంలో స్వల్ప రక్తస్రావ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని నిందితుడిని అడ్డుకున్నారు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా పంజాగుట్ట పోలీసులు సెక్షన్లు 118(1), 352, 351(2) కింద దర్యాప్తు చేస్తున్నారు.

## హుస్సేన్ సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**బేగంపేట మే 29,ప్రభాతవార్త**

హుస్సేన్ సాగర్ సరస్సులో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.కృష్ణా ఆలయం ఎదురుగా ట్యాంక్ బండ్ వద్ద మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు లేక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. లేక్ పోలీసులు ట్యాంక్ బండ్ శివ బృందం సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసారు.మృతుడి వయస్సు సుమారు 40సంవత్సరాలు ఉంటుందని,మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి మార్చురీలో ఉంచామని పోలీసులు తెలిపారు.మృతుని ఆచూకి తెల్సిన వారు లేక్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలనేదే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీగణేష్


పికెట్‌లో మహిళా గ్రూప్‌లకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,మే 29 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో మహిళా సాధికారతకు పెద్ద పీఠ వేశారని,కోటీ మంది మహిళలు కోటీశ్వరులు చేయాలే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యేఎన్.శ్రీగణేష్ తెలిపారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పికెట్ ప్లే గ్రౌండ్‌లో సెల్ఫ్‌హెల్ప్‌గ్రూప్ మెప్మా మహిళలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.2.70 కోట్ల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో సూపర్ మార్కెట్‌లు,బస్సులు, పెట్రల్ బంక్‌లు,గోదాంలు, క్యాంటీన్‌ల నిర్వాహణ ంటి వ్యాపారాలు చేపట్టుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫీసర్ ప్రదీక్, మెప్మా అధికారి ప్రకాశ్, ప్రదీప్,నర్సింహ్మా మూర్తి, గణేష్ దేవాలయం ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ నేతలు సత్య నారాయణ, సి.వైష్ణవి యాదవ్,సి.సంతోష్ యాదవ్, ముప్పిడి మధుకర్, దర్గ రవి, ఇటుక గోపి, శ్యామ్ సుందర్ రెడ్డి, రేపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి : క్రిశాంక్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మన్నెక్రిశాంక్

**కంటోన్మెంట్,మే 29 ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండట్టి కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేయాలని బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నెక్రిషాంక్ పిలుపునిచ్చారు. శుక్రవారం క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను బలోపేతం చేయడానికి ఈనెల 31న కంటోన్మెంట్ నియోజకవర్గం బూత్ లెవల్ శిక్షణాతరగతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్,పద్మారావు గౌడ్,మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిలు పాల్గొనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌ల వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి నివేదిత సాయన్న, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, ప్యారసాని శ్యామ్ కుమార్,లోకనాథం, మోండా డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జులై 7న మాదిగ అమరవీరుల పుణ్యక్షేత్రానికి శంకుస్థాపన


సమావేశంలో మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ

**సైఫాబాద్, మే 29 ప్రభాతవార్త:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జులై 7వ తేదీన ప్రకాశం జిల్లా, ఈదుమూడి గ్రామంలో 'మాదిగ అమర వీరుల పుణ్యక్షేత్రం'కు శంకుస్థాపన నిర్వహిస్తున్నామని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఎంఆర్‌పిఎస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ అమరువీరులు సురేందర్, దామోదర్, మహేష్, భారతి, ప్రవీణ్, నాగేశ్వర్, మీరాసాహెబ్‌లను తాము దేవుళ్ళుగా భావిస్తూ వారి స్మారక స్థూపాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఆది జాంబవుడు, సంత్ రవిదాస్, అరుంధతి, కక్కయ్య మాదిగల స్ఫూర్తితో ఈ పుణ్యక్షేత్రాన్ని ఒక ప్రణాళికా బద్దంగా నిర్మిస్తున్నామన్నారు. దేశంలో అంబేద్కర్ వాదానికి, రాజకీయ రంగానికి పెను ప్రమాదం వచ్చేలా కొంత మంది మనువాద స్వార్థపరులకు తోత్తులుగా మారి రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే సుప్రీంకోర్టు రాజ్యాంగానికి వ్యతిరేకంగా క్రైస్తవ మతం స్వీకరించిన వారికి ఎస్సీ హోదా ఉండదని ప్రకటించిందన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ఎపిలోని కూటమి ప్రభుత్వం మనువాద పోకడలకు సిద్దమవుతున్నదని విమర్శించారు. యువత అంబేద్కర్ వాదంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు నందు నర్సింహ్మా, రాజు, ప్రభాకర్, బాలకృష్ణ, గరటయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కృష్ణకు ఎమ్మెల్యే తలసాని నివాళి


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యదవ్

**సికింద్రాబాద్, మే 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుడు కృష్ణ మృతి బాధాకరం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ఐడిహెచ్ కాలనీ బోయగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జి. కృష్ణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఐడిహెచ్ కాలనీ బోయగూడలోని వారి నివాసానికి వెళ్లి కృష్ణ పార్థీవ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. పార్టీ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పాల్గొనేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ గౌడ్, రాజేందర్, ముక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులైన మాదిగలకు ప్రభుత్వ కమిటీలో అవకాశం ఎక్కడ?

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

**సైఫాబాద్, మే 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తెలంగాణ ఉద్యమకారుల కమిటీలో మేజార్టిగా ఉన్న మాదిగలకు ఎందుకు అవకాశం కల్పించలేదని తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ కమిటీలో ఇద్దరు బిసిలు, ఇద్దరు రెడ్లు, ఒకరు లంబాడీ సామాజిక వర్గం, మరొకరు మాల సామాజికవర్గానికి అవకాశం కల్పించిన సిఎం రేవంత్‌రెడ్డి మాదిగలను విస్మరించారని ఆయన ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అన్ని కులాల కంటే కీలక భాగంలో పనిచేసింది మాదిగలేనని ఆనాడు ప్రభుత్వంచే నియమించిన శ్రీకృష్ణ కమిటీ నివేదిక స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మలిదశ ఉద్యమంలో అరెస్టుయిన 7గురు విద్యార్థి నాయకుల్లో నా నుంచి మొదలుకుని 5గురు మాదిగ సామాజిక వర్గానికి చెందినవారే ఉన్నారని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్ళింది ఉస్మానియా యూనివర్సిటిలో పెట్టిన విద్యార్థి గర్జన సభ, ఈ సభకు అధ్యక్షత వహించింది తానేనని, ఉద్యమాన్ని గ్రామీణ స్థాయికి తీసుకువెళ్ళే ఉద్దేశంతో విద్యార్థులు పాదయాత్ర చేస్తే ఆ యాత్రకు నాయకత్వం వహించింది కూడా తానేనని వంగపల్లి చెప్పారు. మలిదశ తెలంగాణ పోరాటంలో అత్యధిక కేసులు ఎదుర్కొంది మాదిగలేనని, సమైక్యాంధ్రలో కూడా తెలంగాణ ఇవ్వమని కొరింది మాదిగలేనని, ఈ విషయాలను తెలుసుకున్న ఆనాటి సిఎం కెసిఆర్ మాదిగలకు ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చారని శ్రీనివాస్ వివరించారు. ప్రభుత్వానికి మాదిగల పట్ల చిత్తశుద్ధి ఉంటే అసలు సిసలైన ఉద్యమకారులైన మాదిగలకు ప్రభుత్వ కమిటీలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఓటు ద్వారా మాదిగలు రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు. జూన్ 7వ తేదీన జరిగేరాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

## సమాచారం లేకుండా దూలపల్లి శ్రీ చైతన్య స్కూల్ మూసివేత.. తల్లిదండ్రుల ఆగ్రహం


ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

**జీడిమెట్ల, మే 29, ప్రభాతవార్త**
దూలపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్‌ను తల్లి దండ్రులు, విద్యార్థులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూసివేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తూ బాధిత తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై శుక్రవారం వారు దుండిగల్ మండల విద్యాశాఖ అధికారి కృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు.తల్లిదండ్రుల వివరాల ప్రకారం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులు వసూలు చేసి, పుస్తకాలు కొనిపించిన అనంతరం అకస్మాత్తుగా స్కూల్ బోర్డును తొలగించి యాజమాన్యం స్కూల్‌ను మూసివేసిందని తెలిపారు. పిల్లలకు సమీపంలోనే చదువు అందుతుందనే ఉద్దేశంతో రవాణా, వసతి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు ఎలాంటి సమాచారం లేకుండా స్కూల్ తరలింపు చేపట్టడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. స్కూల్ మూసివేత లేదా తరలింపుపై విద్యాశాఖకు ఎలాంటి రాతపూర్వక సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోకుండా యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఫీజులు చెల్లించి, పుస్తకాలు కొనుగోలు చేసిన తర్వాత ఈ పరిస్థితి తలెత్తడంతో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై స్పందించిన మండల విద్యాశాఖ అధికారి కృష్ణ దూలపల్లి శ్రీ చైతన్య హైస్కూల్ తరలింపుకు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దొడ్ల నాగరాజు, పోశెట్టి శ్రీనివాస్, రాజేందర్, వెంకట్, తల్లి దండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### మహిళలు అభివృద్ధికి జిటో సహకారం : కిరణ్ డెంబ్లా

**కంటోన్మెంట్,మే 29 ప్రభాతవార్త:** మహిళల సాధికారతతో పాటు చిన్నతరహా పరిశ్రమలు,యువ పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహాన్ని అందించేందుకు జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) ఉడాన్ పనిచేయడం అభినందనీయమని ప్రముఖ ఫిట్‌నెస్ ఐకాన్ కిరణ్ డెంబ్లా తెలిపారు.శుక్రవారం బాలంరాయిలో క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధిచెంది ప్రపంచాన్ని చాటాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉమాన్ ఎగ్జిబిషన్ జిటో అధ్యక్షురాలు సుధాకీమ్మీ,కార్యదర్శి టీనాషా,అనితా రాంక తదితరులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 110పైకి పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈఎగ్జిబిషన్ రెండు రోజుల పాటుకొనసాగుతుందని నిర్వాహకులు సుధా జైన్ తెలిపారు.

## అహల్యాబాయి హోళీకర్ జయంతి వేడుకలు జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్

**ముషీరాబాద్, మే 29, ప్రభాతవార్త:** అహల్యాబాయి హోళీకర్ 298వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని హట్కర్ అండ్ వీకర్ సెక్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.సంజీవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం దోమలగూడలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 31వ తేదీ ఆదివారం అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని హట్కర్ అండ్ వీకర్ సెక్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు బస్తీ పెద్దలు కలసి దోమలగూడ జ్యోతి నగర్‌లోని కమ్యూనిటీ హాల్ నందు వేడుకలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించే అహల్యాబాయి హోళీకర్ జయంతి వేడుకలకు స్థానిక ప్రజలందరూ హాజరై, విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు జి.రాజు, మాధవరావ్, కే.బాలాజీ, రామారావ్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ లెజెండరీ అవార్డ్స్ ప్రధానోత్సవంలో బండి రమేష్


ఎన్టీఆర్ లెగసి అవార్డులను అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 29, ప్రభాతవార్త**
విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు లెజెండరీ అవార్డ్స్ ప్రధానోత్సవం గురువారం ఫిలింనగర్ క్లబ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ రంగంలో విశేష ప్రతిభ చూపిన పలువురు పెద్దలకు ఎన్టీఆర్ లెగసి అవార్డులను బండి రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి రమేష్ చిత్ర ప్రముఖులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అవార్డులు పొందిన వారిని కళామతల్లి ముద్దుబిడ్డలని రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సినీ రంగానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## మంచినీటి సమస్య పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం : ఎమ్మెల్యే తలసాని


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

**అడ్డగుట్ట,మే 29 ప్రభాతవార్త:** 10 సంవత్సరాల కేసిఆర్ ప్రభుత్వంలో ఏ ఒక్క రోజుకూడా తాగునీటి కోసం ఇబ్బందులు పడలేదని,కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదన్నారు. ప్రజలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారన్నారు. వచ్చే నెల 5 తేదీలోపల గ్రేటర్‌లో మంచినీటి సమస్య పరిష్కరించకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రత్యేక ఓటర్ సవరణ ఎస్ఐఆర్ సర్వేలో మోసాలు జరగకుండా ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి,మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హరిక్రిష్ణ పాల్గొన్నారు.

### డాక్టర్ లక్ష్మణ్‌ను సన్మానించిన మాజీ కార్పొరేటర్


డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వరూపాగౌడ్

**సికింద్రాబాద్, మే 29 ప్రభాతవార్త:** డాక్టర్ కె. లక్ష్మణ్ హౌస్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవి ప్రసాద్ గౌడ్, బౌద్ధనగర్ బీజేపీ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసంగమేశ్వరాలయంలో అధికమాస ప్రత్యేక పూజలు


శ్రీపార్వతీదేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన 33 రకాల వాయనాలు

**నాంపల్లి, మే 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యం గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ సమీపంలోని అత్యంత పురాతన ప్రాచీన శ్రీ సంగమేశ్వర, శ్రీ వేంకటేశ్వరస్వామివార్ల దేవాలయంలో అధికమాస ప్రత్యేక పూజలు శుక్రవారం ఉదయం నేత్రపర్వంగా అర్చకస్వాములు కావించారు. హిందూ సనాతనధర్మంలో ప్రతీ మూడేళ్లకొకసారి వచ్చే అధికమాసాన్ని (పురుషోత్తమ మాసం) అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ మాసంలో విష్ణుమూర్తి ప్రీత్యర్థం 33 సంఖ్యకు (ముక్కోటి దేవతలకు ప్రతీకగా) విశేష ప్రాధాన్యతనిచ్చి దానాలు చేయడం, వాయనం ఇవ్వడం, పిండి వంటలు దానం చేయడంతో లేదా 33 వత్తులతో దీపం వెలిగించడం, ఆవునేయితో దీపారాధన అత్యంత శ్రేష్ఠమార్గం ఆనవాయితీ వస్తోంది. ఇందులో భాగంగా శ్రీ సంగమేశ్వరస్వామివారి దేవాలయంలో శ్రీపా ర్వతిదేవి అమ్మవారికి ఈరోజు భక్తులు 33 వాయనాలు సమర్పిం చుకొని, ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఓం నమో భగవతే వాసుదేవాయ అనే మంత్రాన్ని జపిస్తూ విష్ణు సహస్రనామ పారాయణం కావించారు.

## మీడియా స్వేచ్ఛ కోల్పోతే సమాజం బలహీనం : చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

### -బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్‌లో సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**గచ్చిబౌలి, మే 29 ప్రభాతవార్త**
మీడియా స్వేచ్ఛ కోల్పోయినా, అసత్య వార్తలు ప్రసారం చేసినా, విభజన సృష్టించినా సమాజం బలహీనపడుతుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు.గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాంతిసరోవర్‌లో శుక్రవారం 'మీడియా, మెడిటేషన్, సామాజిక శాంతి' అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మీడియా నాల్గవ స్థంభమని, దాని బాధ్యత ఇతర ప్రజాస్వామ్య వ్యవస్థల కంటే ఎంతో కీలకమని అన్నారు. సమాజంలో ఎంతో కీలకమైన ఈ రంగంలో ప్రతిరోజు జర్నలిస్టులు ఎన్నో సవాళ్లు, ఒత్తిడితో బాధ్యతలు నిర్వహిస్తుంటారని అన్నారు. రాజయోగ ధ్యానంతో జర్నలిస్టులు తమలో శాంతిని పెంపొందించుకుంటే వారు సమాజంలో శాంతిని నెలకొల్పగలుగుతారని అన్నారు. ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర వహించే మీడియా విశ్వసనీయత తగ్గితే సమాజం నష్టపోతుందని అన్నారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, చట్ట సభల కంటే మీడియా రంగం ఎంతో కీలకమైనదని అన్నారు. పరిపాలన సాగించే వారు ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఎదగటం లేదనే భావన ప్రజల్లో ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు గౌరిశంకర్ మాట్లాడుతూ డబ్బు, పేరు కోసం పరుగెడుతూ మనుషులు శాంతిని కోల్పోతున్నారని అన్నారు. సోషల్ మీడియాలో నియంత్రణ లేకపోవడం కారణంగా ఫేక్ న్యూస్ పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో శాంతి, విలువల కోసం బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలు అభినందనీయమని, నేటి యువత, వ ృద్ధులకు విలువలపై తరగతులు నిర్వహించాలని సూచించారు. బ్రహ్మకుమారీస్ హైదరాబాద్ జోన్ డైరెక్టర్ బికె.కులదీప్ దీదీ మాట్లాడుతూ మాటల శక్తి ఎంతో గొప్పదని అన్నారు. మీడియా ద్వారా సానుకూల మార్పు తీసుకురావాలంటే అంతర్ముఖ శాంతి, పవిత్రత అవసరమని అన్నారు. దేవునితో అనుసంధానంతో ఆత్మబలం పెంచుకొని, సమాజంలో సానుకూలతను పంచాలని పిలుపునిచ్చారు. ముంబైకి చెందిన వైద్యుడు డాక్టర్ సచిన్ పరేబ్ మాట్లాడుతూ ఒత్తిడితో విధులు నిర్వహించే జర్నలిస్టులకు, మీడియా ప్రతినిధులకు ఆరోగ్య సూచనలు అందించారు. ఒత్తిడి కారణంగా గుండె, రక్తపోటు మెదడు పనితీరు వంటి అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. మానసిక, బావోద్వేగ, శారీరక, సామాజిక ఆరోగ్యం కలిసి సంపూర్ణ ఆరోగ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు డాక్టర్ సురేష్ వర్మ, అంజలి, ఉమారాణి, వంశీ పాల్గొన్నారు.

## ఆఖండ తాళ సప్తాహం...ఆధ్యాత్మికతలో భక్తజనం


చిటికెల భజన బృందాన్ని సన్మానిస్తున్న నిర్వాహకులు గౌని అజయ్ కుమార్ గౌడ్ తదితరులు

**చాంద్రాయణగుట్ట, మే 29, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట దేవి దేవాలయంలోని శ్రీ పంచాయతన బాల విశ్వేశ్వరస్వామి ఉపాలయ ప్రాంగణంలో శ్రీ పాండురంగ విఠలేశ్వర్ అఖండ 34వ తాళ సప్తాహ మహోత్సవం - 2026 గత ఏడు రోజులుగా అత్యంత వైభవంగా, భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక మాసాన్ని (పురుషోత్తమ మాసం) పురస్కరించుకొని ఈనెల 23వ తేదీ శనివారం తాళ సప్తాహం ప్రారంభమైన విషయం తెలిసిందే. గ్రామ పురోహితులు గోళ్ళ నరహరి శర్మ, ఎ.విజయ్ కుమార్ల ఆధ్వర్యంలో, నిర్వాహకులు గౌని అజయ్ కుమార్ గౌడ్ పర్యవేక్షణలో పాండురంగ విఠలేశ్వరునికి నిత్యపూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరోవైపు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భజన మండళ్ళు తమకు నిర్దేశించిన సమయంలో హాజరై రాత్రింబవళ్లు నిరంతరాయంగా భజనలు చేస్తున్నారు. ఇందులో మహిళల భజన మండళ్లు సైతం పాల్గొంటూ తమ భక్తి కీర్తనలు, పాటలతో ఆకట్టుకుంటున్నారు. ఆయా భజన మండళ్ల ఆట, పాటలతో ఆధ్యాత్మిక సాగరంలో విహరిస్తున్నారు. నిర్వాహకులు వారిని శాలువతో ఘనంగా సన్మానిస్తున్నారు. నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు తుంబురా మెడలో వేసుకొని తాళాలు కొడుతూ భజనలు చేస్తున్నారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. సప్తాహం 30వ తేదీ శనివారం చివరి రోజు తెల్లవారు జామున 5 గంటలకు కాగడ హారతి, 9గంటలకు అఖండ తాళ పరిసమాప్తి, విఠలేశ్వరుని పల్లకి సేవా ఊరేగింపు, గోపాల్ కాల, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలుంటాయి.

## కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి: కూన శ్రీశైలం గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం గౌడ్

**నిజాంపేట్, మే 29, ప్రభాతవార్త**
కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఎన్నికల సన్నద్ధత, ఓటరు నమోదు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ కమిటీలు, మండల కమిటీలను చురుకుగా పనిచేసేలా బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరగకుండా బూత్ స్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, నకిలీ ఓట్ల తొలగింపుకు కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను గ్రామ స్థాయిలో వివరించి పార్టీకి మరింత ఆదరణ తీసుకురావాలని అన్నారు.ఈ సమావేశంలో హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, పాల్గొన్నారు.

## ఫొటోలు వీడియోలు వైరల్ చేస్తానంటూ బెదిరింపులు

### - జైలు నుంచి బయటకొచ్చినా ఆగని వేధింపులు

**జూబ్లీహిల్స్, మే 29, ప్రభాతవార్తః**
పెళ్లి పేరుతో మోసం చేసి, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ యువతిని బెదిరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితురాలిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటంతో బాధిత యువత ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన యువతి(30) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఆమెకు బోనోత్ రాహుల్‌తో కొన్నేళ్లుగా పరిచయం ఉంది. ప్రేమిస్తున్నానని, పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి రాహుల్ ఆమెకు దగ్గరై మోసానికి పాల్పడటంతో మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. దీంతో రాహుల్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. బెయిల్‌పై విడుదలైన రాహుల్ ఈ నెల 7న మళ్లీ ప్రణీతకు ఫోన్ చేసి ప్రేమిస్తున్నానని, ఒకసారి మాట్లాడాలని కోరగా అంగీకరించిన ప్రణీతను తన వద్ద ఉన్న ప్రైవేట్ ఫొటోలు, వీడియోలున్నాయని, వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతానంటూ బెదిరించాడు. మే 14న సోమాజిగూడలోని బంధన్ బ్యాంక్ కార్యాలయానికి రావాలని ఒత్తిడి చేశాడు. ఆమె అక్కడికి వెళ్లగా, జైలు నుంచి బయటకు వచ్చానని చెబుతూ రాహుల్ కుల దూషణలకు పాల్పడ్డాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ వీడియోలు వైరల్ చేస్తానని బెదిరించాడు. అనంతరం తన అనుచరులను పిలవడంతో భయపడిన యువతి అక్కడి నుంచి సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఎర్రమంజిల్ ఆర్ఎన్‌టీఎస్ భవనం సమీపంలో రాహుల్ ఆమెపై దాడి చేసి చేతులపై కొట్టడంతో పాటు మెడ నొక్కి, కాళ్లతో తన్నాడని ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం తన సోదరులతో కలిసి వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని, మెడ నొక్కి హత్యాయత్నం కూడా చేశారని ఆరోపించింది. రాహుల్ బెదిరిస్తున్నాడని, అతనితో పాటు వెంకటేష్, ప్రసాద్‌ల నుంచి తనకు ప్రాణహాని ఉందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొనగా పంజాగుట్ట పోలీఉసలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT : MEDIPALLY
O.S.No. 195 OF 2026
Between:
Bhavani Damodar & others ...Plaintiffs
And
The Tahsildar /MRO, Medipally Revenue Mandal, Medchal-Malkajgiri District & another ...Defendants
To
All concerned (Defendant No.2
NOTICE
Please take notice that the above named plaintiffs have filed above suit for declaration to declare the plaintiffs as Legal Heirs of Late Bhavani Sharada @ Sharadha. B W/o. Bhavani Damodarwho died intestate on 06.10.2012in respect of the suit schedule property and the matter is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 29.06.2026at 10.30 AM, either in person are through on advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte. SUIT SCHEDULE PROPERTY: All the lands in plot bearing No.287 as per layout sanctioned by the Gram Panchayat, Changicharla village, previously Hayathnagar Tq. Now Medipally Mandal, previously Ranga Reddy District, Now Medchal-Malkajgiri District, Telangana State, Dt.24.02.1984 as per the said Map, in Survey Nos.26,27,28,30,31,32, situated at Changicherla village, previously Hayathnagar Tq. Now Medipally Mandal, previously Ranga Reddy District, Now Medchal-Malkajgiri District, Telangana State, admeasuring 303 Sq.yards or equivalent to 252 Sq.Mtrs, situated at Changicherla village, previously Hayathnagar Tq. Now Medipally Mandal, previously Ranga Reddy District, Now Medchal-Malkajgiri District, Telangana State, which comes under the Grampanchayat Changicherla, previously Hayathnagar Tq. Now Medipally Mandal, Registration Sub-Registrar Uppal, Now Sub-Registrar Narapally and bounded by : North : Plot No.284, South : 30' Wide Road, East : Plot No.286, West : Plot No.288.
// By Order of the court //
M.SUNITHA
Advocate
# Siri Nagar, L.B.Nagar
R.R.District Ph: 8074025363

VAARTHA CLASSIFIEDS
CHANGE OF NAME
★ I, BATTULA ANIL KUMAR S/o BATTULA LINGAIAH R/o H.No. 1-10-180, Street No.8, Ashok Nagar, Hyd, Changed my Son's Name from BATTULA SATHWIK to BHAVYESH VARDAN for All Records purpose.
★ I, TISHA JAIN (Old Name) D/o. M. Naveen Chand R/o.10-7-49, Line Bazar, Chilkalguda, Sec'bad-3. Have changed my name as TISHA (New Name) vide affidavit dt 28.05.26

ఫారం నం. NCLT. 3A
పిటిషన్ వివరాలను తెలియజేసే ప్రకటన
[నియమం 35 చూడండి]
కంపెనీ పిటిషన్ నం. 10/131/HDB/2026 - పిటిషన్ నోటీసు
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 131 క్రింద ఒక పిటిషన్ దాఖలు చేయబడింది. ఈ పిటిషన్ ద్వారా, కార్పొరేట్ రుణగ్రహీత యొక్క ఆర్థిక నివేదికలలో తగిన మార్పులు చేసిన తర్వాత, 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతా పుస్తకాలు మరియు వార్షిక రిటర్న్‌లను సవరించుకోవడానికి అనుమతి కోరబడింది. అలాగే, 2022-2023 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఆర్థిక నివేదికలకు అనుగుణంగా, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఖాతా పుస్తకాలు, ఆర్థిక నివేదికలు మరియు వార్షిక రిటర్న్‌లను పరిమిత స్థాయిలో సవరించుకోవడానికి పిటిషనర్ అయిన లాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్‌కు అనుమతి ఇవ్వాలని కూడా ఈ పిటిషన్ కోరుతోంది. ఈ పిటిషన్‌ను లాంకో కొండపల్లి పవర్ లిమిటెడ్ వారు జనవరి 07, 2026వ తేదీన సమర్పించారు. సదరు పిటిషన్ విచారణ నిమిత్తం, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ యొక్క హైదరాబాద్ బెంచ్ - II ముందు జూన్ 19, 2026వ తేదీన జాబితా చేయబడింది. ఈ పిటిషన్/దరఖాస్తు/ప్రస్తావనను సమర్థించాలనుకునే లేదా వ్యతిరేకించాలనుకునే ఏ వ్యక్తి అయినా, తన ఉద్దేశాన్ని తెలియజేస్తూ ఒక నోటీసును పిటిషనర్ న్యాయవాదికి పంపాలి. ఈ నోటీసుపై సంబంధిత వ్యక్తి లేదా వారి న్యాయవాది సంతకం చేసి, తమ పేరు మరియు చిరునామాను తప్పక పేర్కొనాలి. ఈ నోటీసు, పిటిషన్/దరఖాస్తు/ప్రస్తావన విచారణకు నిర్ణయించిన తేదీకి 'రెండు రోజుల ముందు' లోపు పిటిషనర్ న్యాయవాదికి చేరేలా పంపాలి. ఒకవేళ ఎవరైనా ఈ పిటిషన్/దరఖాస్తు/ప్రస్తావనను వ్యతిరేకించాలనుకుంటే, ఆ వ్యతిరేకతకు గల కారణాలను లేదా తమ అఫిడవిట్ యొక్క ప్రతిని సదరు నోటీసుతో పాటు తప్పక సమర్పించాలి. ఈ పిటిషన్/దరఖాస్తు/ప్రస్తావన యొక్క ప్రతిని కోరుకునే ఏ వ్యక్తికైనా, నిర్ణీత రుసుము చెల్లించిన మీదట, దిగువ సంతకం చేసిన వారిచే ఆ ప్రతి అందించబడుతుంది.
(Sd) షబ్బీర్ అహ్మద్
(పిటిషనర్ న్యాయవాది),
చిరునామా: 306, అశోక క్యాపిటల్, రోడ్ నం.2, బంజారా హిల్స్, హైదరాబాద్-500034, మొబైల్ నం: 9160047784
తేదీ: 30-05-2026

## నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా రాజు

**హయత్ నగర్, మే 29 ప్రభాతవార్త :** నాగోల్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా జి.రాజు శుక్రవారం పెద్ద అంబర్ పేట్ లోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతనెల 30న డిప్యూటీ కమిషనర్ రవిందర్ రెడ్డి పదవీ విరమణ చేయగా... నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ కు నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఇప్పటి వరకు సెలవులో ఉన్న స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ రాజు విధుల్లో చేరగా ఆయనను నాగోల్ సర్కిల్ పూర్తి స్థాయి డిప్యూటీ కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ధ్యేయంగా పనిచేస్తానన్నారు.


పెద్ద అంబర్‌పేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న డి.సి రాజు

## పివిపి అంజని కుమారికి అన్నమయ్య పురస్కారం అందజేత


పివిపి అంజని కుమారిని సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు తదితరులు

**మలక్ పేట, మే 29, (ప్రభాతవార్త):** ప్రముఖ సామాజికవేత్త, సిఎస్సి కోర్టు సూపరింటెండెంట్ పీవీపీ అంజనికుమారికి అన్నమయ్య పురస్కారం, నందమూరి తారక రామారావు పురస్కారాలనుఅందజేశారు. నగరంలోని శ్రీ కళానిలయం ఆడిటోరియంలో ఫౌండర్ చైర్ పర్సన్ సురేందర్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ అన్నమాచార్య 617 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనికుమారికి తాళ్లపాక అన్నమాచార్య పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజానికి తమ వంతు సేవలను నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. అన్నమాచార్య పురస్కారాన్ని తనకు అందజేయడం సంతోషకరంగా ఉందని తెలిపారు. అలాగే నందమూరి తారకరామారావు పురస్కారాన్ని కూడా తనకు ప్రధానం చేయడం జరిగిందని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సంగీత సాహిత్య కూచిపూడి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి మధుసూదనచారి, దైవజ్ఞశర్మ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోఆర్డినేటర్ బింగి నరేంద్ర గౌడ్, కళానిలయం అధ్యక్షులు పద్మలత, కార్యదర్శి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

**: ఎంబిటి అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ ఖాన్**


ఎంబిటి అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ కు బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు తదితరులు

**మలక్ పేట, మే 29, ప్రభాతవార్త:** పండుగలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంబిటి అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని పలువురు నాయకులు కార్యకర్తలు చంచల్ గూడ లోని ఆయన నివాసంలో అంజాదుల్లా ఖాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని తెలిపారు. బక్రీద్ పండుగ త్యాగం, దాతృత్వం, విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. పండుగలు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అస్మాన్ ఘడ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి: శ్యాం రావు

**మలక్ పేట, మే 29, ప్రభాతవార్త:** మలక్ పేట్ నియోజకవర్గం అస్మాన్ ఘడ్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ రావు, నగర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి గోపాల్ లు పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి మలక్ పేట్ నియోజకవర్గం అస్మాన్ ఘడ్ డివిజన్ నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు అస్మాన్ ఘడ్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడవల్లి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు చేయూత : పిఓ పద్మావతి


స్వయం సహాయ సంఘాలకు రుణాలు అందజేస్తున్న ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, బ్యాంక్ మేనేజర్ ప్రతిభ తదితరులు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు స్వయం సహాయక సంఘాలకు సంబంధించి మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉప్పల్ సర్కిల్‌లో స్వయం సహాయక సంఘాలకు రుణ మేళా నిర్వహించారు. రుణ మేళాలో భాగంగా కెనరా బ్యాంక్ రామంతాపూర్ లో ఏడు స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 1 కోటి 5 లక్షలు లైవ్లీ హుడ్ ఆక్టివిటీస్ నిర్వహించడానికి మంజూరు చేసినట్లు ప్రాజెక్ట్ అధికారి జె.పద్మావతి, కెనరా బ్యాంక్ మేనేజర్ పి. ప్రతిభ తెలిపారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలకు తగు శిక్షణ ఇచ్చి వారికి చేయూత అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీధర్ రెడ్డి, వాణి, పుష్పలత పలువురు రిసోర్స్ పర్సన్ మెంబర్స్ పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించం

**-760 మందికి సంస్కార్ మెగా కౌన్సెలింగ్..**
**- యువతలో ప్రవర్తనా మార్పే లక్ష్యమన్న సిసి సుమతి**

**నేరెడ్‌మెట్ మల్కాజిగిరి కమిషనరేట్ , మే 29,ప్రభాతవార్త :** మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడుతున్న వారిలో ప్రవర్తనా మార్పు తీసుకురావడమే లక్ష్యంగా మల్కాజిగిరి కమిషనరేట్ షీ టీమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సంస్కార్ మెగా కౌన్సెలింగ్ ప్రోగ్రామ్‌లో పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ కీలక సందేశం ఇచ్చారు. మహిళల భద్రతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.సమాజంలో మహిళలు భయరహిత వాతావరణంలో జీవించే పరిస్థితులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న ఆమె, షీ టీమ్స్ లక్ష్యం కేవలం కేసులు నమోదు చేయడం మాత్రమే కాదని, తప్పు చేసిన వారిలో మార్పు తీసుకువచ్చి బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమని అన్నారు. ఒకసారి పోలీసు రికార్డుల్లో పేరు నమోదైతే భవిష్యత్తు అవకాశాలపై ప్రభావం పడుతుందని, అందుకే యువత తమ ప్రవర్తనను సరిదిద్దుకోవాలని సూచించారు.ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 18 వరకు మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీనగర్ జోన్లలో షీ టీమ్స్ 61 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 236 పెట్టీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 760 మంది ప్రతివాదులను గుర్తించగా, వారిలో 137 మంది మైనర్లు, 384 మంది 24 ఏళ్లలోపు యువకులు ఉండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. యువతలో చట్టాలపై అవగాహనతో పాటు మహిళల పట్ల గౌరవభావం పెంపొందించాల్సిన



అవసరం ఉందని చెప్పారు.ఇప్పటివరకు 406 విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా 53 వేల మందికి పైగా మహిళా భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించినట్లు సీపీ తెలిపారు. భవిష్యత్తులోనూ ఫాలోఅప్ కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన చోట 'చేంజ్ మెంటర్స్'ను నియమిస్తామని చెప్పారు.కార్యక్రమంలో మనోజాగృతి సంస్థ అధిపతి, సైకాలజిస్టు గీతా చల్లా బృందం ప్రవర్తనా మార్పు, భావోద్వేగ నియంత్రణ, సామాజిక బాధ్యతపై ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించింది. న్యాయ సలహాదారు కృష్ణమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రశేఖర్ బీఎన్ఎస్, పోక్సో, ఐటీ చట్టాల కింద నేరాలకు సంబంధించిన చట్టపరమైన పరిణామాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ డాక్టర్ బి. అనూరాధ, మహిళా భద్రత విభాగం డీసీపీ టి. ఉషారాణి, అదనపు డీసీపీ బి. కోటేశ్వరరావు, షీ టీమ్స్ ఏసీపీ పి. వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, ప్రతివాదులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎంఎంసి పరిధిలో అనర్హులకు చేయూత ఫించన్లు..!

**-బడాబాబులకు ఫించన్లు.. అధికారులకు ఫిర్యాదులు**

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో చేయూత ఫించన్లు పొందుతున్న వారిలో అనర్హులు అధిక సంఖ్యలో వెలుగులోకి వస్తున్నారు. గత కొద్ది రోజులుగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో చేయూత ఫించన్‌దారుల జీవన నిర్ధారణ కోసం లబ్ధిదారుల నుంచి ఆధార్, లైవ్ ఫోటోలు తీసుకుంటున్నారు. దీంతో కేంద్రాల వద్దకు వస్తున్న వారిని విచారణ చేయగా అధిక శాతం మంది బడాబాబులే బయటపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నాచారం, కాప్రా తదితర సర్కిల్ పరిధిలో సుమారు 40వేల మంది వరకు లబ్ధిదారులు ఉన్నారు. ఉప్పల్ సర్కిల్‌లో సుమారు 9250 మంది వరకు ఫించన్‌దారులు ఉండగా, వీరిలో రాజకీయ పార్టీల నేతలు,ప్రముఖులు, కాలనీ సంఘాల ప్రతినిధులు, బడాబాబులు కూడా ఫించన్లు తీసుకుంటున్నారు. బోడుప్పల్ సర్కిల్‌లో కొందరు ప్రముఖ వ్యక్తులు కూడా ఫించన్లు పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండిపెడుతున్నారు. ఇప్పటికే ఫించన్లు పొందుతున్న నకిలీ లబ్ధిదారుల జాబితాను కొందరు మున్సిపల్ అధికారులకు అందజేశారు.అయితే వీరిని తిరిగి విచారణ చేసి జాబితాల నుంచి తొలగిస్తామని జోనల్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పథకాలను తప్పుదారిలో పొందుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఉప్పల్ జోనల్ పరిధిలో స్వంత నివాసాలు ఉండి, తమ పిల్లలు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న కొందరు కూడా చేయూత ఫించన్లు పొందుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నికల వేళ 57 సంవత్సరాలు ఉన్న వారికి


ఉప్పల్ సర్కిల్‌లో ఫించన్ లబ్ధిదారుల నుంచి పోటో తీసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది దృశ్యం.

ఫించన్లు ఇస్తున్నట్లు ప్రకటించడంతో అధిక శాతం మంది అనర్హులు ఫించన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలా మందిని సరిగ్గా విచారణ చేయకుండానే ఫించన్లు ఇచ్చినట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

**నకిలీ ఫించన్‌దారులపై ఫిర్యాదు చేయండి : ఎంఎంసి**

ఉప్పల్ జోనల్ పరిధిలోని ఉప్పల్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నాచారం, కాప్రా పరిధిలో స్వంత నివాసాలు ఉండి, వారు పనిచేస్తూ, వారి పిల్లలు కూడా ఉద్యోగాలు చేస్తున్నా ఫించన్ పొందుతున్న వారి గురించి ఎంఎంసికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కోరారు. అనర్హులు ఫించన్ పొందుతున్నట్లు రుజువైతే వారి నుంచి రికవరీ చేయడంతోపాటు, కేసులు కూడా నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు. ఇప్పటికే కొందరి గురించి పిర్యాదులు అందాయని, వారిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. కాగా నిజమైన లబ్ధిదారులు ఆధార్ కార్డుతో సంబంధిత కేంద్రానికి వెళ్లి పోటో తీసుకోవాలని సూచించారు.

## నూతన అధ్యక్షులుగా ఓర్సు శ్రీనివాస్‌కు వడ్డే రాజుల తరుపున ఘనసన్మానం

**తుర్కయంజాల్, మే 29 ( ప్రభాతవార్త)**

జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన ఓర్సు శ్రీనివాస్‌కు వడ్డెర సంఘం నాయకులు ఘన సన్మానం చేశారు. ఈసందర్భంగా అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి డివిజన్ల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రతి కార్యకర్తకు ప్రాధాన్యత కల్పించడం తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి సహకారంతో అధ్యక్షుల పదవులు ఇచ్చినందుకు వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తుర్కయంజాల్, డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగిస్తామని వెల్లడించారు.



అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు ఓర్సు శంకర్, ఓర్సు శ్రీనివాస్ వరికుప్పల సత్యనారి, వరుకుప్పల శ్రీరాములు, నందు, వెంకటేష్, మురళి, వంశీ, నరేష్, గణేష్, నందు,తదితరులు పాల్గొన్నారు .

# కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డితో కాంగ్రెస్ నేతల భేటీ

**-ఆలయ కమిటీ నియామకాలపై చర్చించిన నాయకులు**

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చే బాలాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసారు. బాలాపూర్ గ్రామానికే చెందిన టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు తుక్కుగూడలోని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలివచ్చి కెఎల్ఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బాలాపూర్ గ్రామంలోని అతి పురాతనమైన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయం, శివాలయం (మహాదేవరజీ దేవాలయం), బాలాపూర్ దేవతలగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీల విషయమై వారంతా కెఎల్ఆర్‌తో చర్చించారు. ఈ అనంతరం ఆయా దేవాలయాలకు చైర్మన్, డైరెక్టర్ పదవులను ఆశిస్తున్న వారు తమ పేర్లను కెఎల్ఆర్‌కు అందజేశారు. ఆ తర్వాత కెఎల్ఆర్ మాట్లాడుతూ ఆలయ కమిటీల ఏర్పాటులో అందరి అభిప్రాయాలను తీసుకొని నియమిస్తామని తెలిపారు. ఓసి, బిసి, ఎస్సీ వర్గాలకు అవకాశం కల్పిస్తామని ఆయన వెల్లడించారు.


యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కెఎల్ఆర్‌ను కలిసిన బాలాపూర్ కాంగ్రెస్ నాయకులు

కెఎల్ఆర్‌ను కలిసిన వారిలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్, డిసిసి మాజీ ఉపాధ్యక్షుడు వంగేటి మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల స్వామి ఆలయ మాజీ చైర్మన్ కొలన్ కృష్ణారెడ్డి, బండ్లగూడ ఖాల్సా సొసైటీ మాజీ డైరెక్టర్ గొరిగె శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు రావుల లింగం, గుండోజు వెంకటాచారి, ఎర్ర దర్శన్‌ణ, మేకల మహేందర్, భాను ప్రసాద్, గిరి, కొండా శ్రీధర్‌రెడ్డి, మర్రి చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు మాజీ కార్పొరేటర్ బాలు నాయక్, అమృతానాయుడు, మాదరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి : బిజెపి


మండల విద్యాధికారి రామారావును కలిసి పాఠశాల సమస్యలు విన్నవిస్తున్న ఉప్పల్ డివిజన్ బిజెపి నేతలు

**ఉప్పల్, మే 29 ప్రభాతవార్త :** ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మౌళిక సదుపాయాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పలువురు బిజెపి నేతలు శుక్రవారం మండల విద్యాధికారి రామారావును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ బిజెపి సీనియర్ నాయకులు మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, రావుల బాలకృష్ణ గౌడ్, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి, సింగారం కార్తీక్, బోరంపేట మురళి క్రిష్ణ,మామిళ్ల హరి శంకర్ తదితరులు మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయని, విద్యార్థులకు యూనిఫార్మ్, పుస్తకాలు సమయానికి అందించాలని కోరారు. ప్రవేట్ పాఠశాల యాజమాన్యంలు తక్కువ ఫీజులు వసూలు చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు అన్ని విధాలుగా సహకరించాలని వారు కోరారు. దీనిపై మండల విద్యాధికారి రామరావు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మంత్రాల చెరువులో ఏర్పాటుకు శ్రీకృష్ణుడి విగ్రహం సిద్ధం


శ్రీకృష్ణుడి భారీ విగ్రహాన్ని పరిశీలించిన జిల్లెలగూడ/మీర్‌పేట్ శ్రీకృష్ణ భగవాన్ విగ్రహ ఏర్పాటు కమిటీ

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మంత్రాల చెరువులో కామధేను, మయూర సహిత శ్రీకృష్ణుడి 10 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లెలగూడ/మీర్‌పేట్ శ్రీకృష్ణ భగవాన్ విగ్రహ నిర్మాణ కమిటీ వెల్లడించింది. మంద మల్లమ్మ చౌరస్తా–బాలాపూర్ చౌరస్తా రోడ్డులో ఆర్‌సిఐ రహదారి పక్కనే ఉన్న సువిశాల మీర్‌పేట్ మంత్రాల చెరువులో 8 అడుగుల రాతి గుండుపై 10 అడుగులు ఉన్న సుందర శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కమిటీ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని అట్టహాసంగా ఊరేగింపుగా తీసుకురావడానికి సైతం ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కమిటీ నాయకులు జెనిగె జంగయ్య యాదవ్, ఆవుల సత్తయ్య యాదవ్, దేవనమోని శ్రీనివాస్ యాదవ్, బచ్చనమోని కాశీరాం యాదవ్, ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, అబ్బనమోని గోపియాదవ్, బచ్చనమోని నర్సింహ యాదవ్, జెనిగె శ్రీశైలంయాదవ్, బచ్చనమోని సైదులు యాదవ్, వట్టి శ్రీశైలం యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, బెల్లి శివయాదవ్ తదితరులు శ్రీకృష్ణ విగ్రహాన్ని పరిశీలించి అనంతరం స్థానిక మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శోభన్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శ్రీకృష్ణుడి జ్ఞాపికను అందజేసి కామధేను, మయూర సహిత శ్రీకృష్ణ భగవాన్ విగ్రహానికి స్వాగతం పలికే ఊరేగింపుకు అనుమతినిచ్చి తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## వృద్ధురాలి అనుమానాస్పద మృతి

**హయత్ నగర్, మే 29 ప్రభాతవార్త :**

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం వెనుక ఇంటిలో నివసిస్తున్న కారె అండాలమ్మ (85)మరణించినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.అండాలమ్మ భర్త పాపిరెడ్డి గతంలో చనిపోయాడు.ఆమెకు ఇద్దరు కుమారులు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.కోహెడలోని ఇంటిలో ఆమె ఒంటరిగా ఉంటోంది. మృతదేహంపై ఎటువంటి గాయాలు లేనప్పటికీ ఆమె చేతుల కు ధరించే గాజులు లేకపోవడంతో మృతురాలి బంధు వులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసు లు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.


బిజెపి రంగా రెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రగతి రిసార్ట్ లో నిర్వహించిన ప్రశిక్షణ మహాభియాన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ బిజెపి కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గ బిజెపి నేతలు

## సహకార స్ఫూర్తితో అనేక రంగాల వారికి సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**ఎల్.బి.నగర్ మే 29 ప్రభాతవార్త:**

సహకార స్ఫూర్తితో బ్యాంకు ఖాతాదారులకు అనేక రంగాల వారికి సేవలందిస్తుందని విశాఖపట్నం మల్టీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ జెవి.సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ నాగోల్ శాఖ మహాజనసభ శుక్రవారం అల్కాపురి స్వాగత్ గ్రాండ్ హోటల్లో బ్రాంచ్ ఇన్చార్జి డైరెక్టర్ ఈమని అవని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సహకార వ్యవస్థలో పేద మధ్యతరగతి ప్రజలకు సమానత్వం కోసం ఆర్థిక పరిపుష్టి కోసం అనేక సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నామన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సాంఘిక సాంకేతిక పరిణామాలు దృష్టిలో పెట్టుకొని మనదేశంలో సహకార వ్యవస్థను నిలబెడుతూ రిజర్వ్ బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా ఖాతాదారులను చైతన్య పరుస్తున్నామన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేయడం కోసం తనవంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా జే.ప్రసాద్, సి.ఆర్.సుకుమార్, జోనల్ మేనేజర్ పెద్ద ప్రసాద్, నాగోల్ బ్రాంచ్ మేనేజర్ ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం వార్షిక కాలానికి బ్యాంకు సాంప్రదింపుల కమిటీని ఎన్నుకున్నారు. సంప్రదింపుల కమిటీ సభ్యులుగా ఏం.నారాయణరెడ్డి, ఏ.గోవిందరావు, పి.సుధాకర్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, నాగజ్యోతి, దీపక్ సింగ్ ఠాగూర్ లను ఎన్నికయ్యారు.

## రైతులకు న్యాయం చేయాలి: మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**తుర్కయంజాల్ మే 29( ప్రభాతవార్త)**

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కోహెడ గ్రామంలో ప్రతిపాదిత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతుల తరఫున రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి వారు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రైతులతో పాటు కలెక్టర్ గారిని కలిసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం ఇప్పటికే కేటాయించిన భూమిని పక్కనబెట్టి, ప్రస్తుతం సర్వే నం. 167/1లో సుమారు 264 ఎకరాల భూమిని తీసుకుంటున్న సందర్భంగా.. ఈ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సుమారు 160 మంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా సరైన నష్టపరిహారం అందించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్ గారిని కోరారు.అదేవిధంగా, వచ్చే నెల 03వ తేదీన ఫ్రూట్ మార్కెట్‌కు శంకుస్థాపన జరగనున్నట్లు సమాచారం ఉన్నందున, ఆలోపు ఈ పేద రైతుల జీవన భద్రతను పరిరక్షించేలా కాంగ్రెస్ ప్రభుత్వం,అధికారులు,తక్షణ చర్యలు తీసుకోవాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి కోరారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్ వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

## హిట్ పాలసీని సద్వినియోగం చేసుకోండి

**-టీఎస్ఐఐసి ఈడి పవన్ కుమార్**
**-హిల్ట్ పాలసీ పై చర్లపల్లి లో అవగాహన**




**కుషాయిగూడ, మే 29,ప్రభాతవార్త :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హిల్ట్ పాలసీని పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడి) పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సిఐఏ ఆడిటోరియంలో పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హిల్ట్ పాలసీపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. హిల్ట్ పాలసీ దరఖాస్తు చేసుకునే విధానం పలు అంశాలపై ఆయన వివరించారు. హిల్ట్ పాలసీని బలవంతంగా అమలు చేయాలని చూడటం లేదని ఇష్టమున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పారిశ్రామికవేత్తలకు పారిశ్రామికవాడలో కేటాయించిన స్థలాలను 10 శాతం రుసుము చెల్లించి ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఐసి జీడిమెట్ల జోనల్ మేనేజర్ మధు, చర్లపల్లి ఐలా కమిషనర్ ప్రభాకర్, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమైక్య అధ్యక్షుడు కొండవీటి సుధీర్ రెడ్డి, చర్లపల్లి ఐలా చైర్మన్ గోవిందరెడ్డి, సిఐఏ అధ్యక్షులు డి శ్రీనివాసరెడ్డి, ఐలా వైస్ చైర్మన్ తాటి శ్రీనివాస్, ఐలా మాజీ చైర్మన్లు జక్కా రోషి రెడ్డి, మనోహర్ రాజు పారిశ్రామికవేత్తలు దస్తగిరి రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాఘవయ్య, మోహన్, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, గంగాధర్ బాబు, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన శంకర్‌రెడ్డి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్నిస్తున్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:** పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ -2026 శిక్షణను పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందిన మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ బిజెపి కో–ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసారు.శిక్షణ పూర్తి చేసుకొని సర్టి ఫికెట్ తీసుకున్న నేపథ్యంలో ఆయన మర్యాదపూర్వకం గా కిషన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్నిచ్చి అందజేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డిని కేంద్రమంత్రి అభినందించారు.

# పోలీస్ స్టేషన్, మీసేవ కేంద్రాలను తరలించవద్దని ధర్నా

**ఎల్.బి.నగర్ మే 29 ప్రభాతవార్త:** పోలీస్ స్టేషన్ మీసేవ కేంద్రాలను మరోచోటుకు తరలించవద్దని దీంతో స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్ వికాస్‌నగర్ మీ సేవ కేంద్రంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, న్యూదిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మీ సేవ కార్యాలయం కోసం వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా స్థానికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ధర్నాకు ఎమ్మెల్యే మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్ ఏర్పాటు వల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు పెరిగే అవకాశం ఉందని, కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి తలెత్తుతుందన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న కార్యాలయాలను తొలగించడం సమంజసం కాదన్నారు. న్యూదిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న సీనియర్ సిటిజన్స్ భవనాన్ని మీ సేవ కార్యాలయానికి కేటాయిస్తే, వృద్ధులకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న టీమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో పోలీస్ స్టేషన్ కోసం 3000 గజాల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. అక్కడ నిర్మాణం చేపట్టకుండా ప్రస్తుతం ప్రజలకు ఉపయోగపడుతున్న భవనాలను ఖాళీ చేయించడం సరైన నిర్ణయం కాదన్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు పునరాలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, నర్సిరెడ్డి, నాగలక్ష్మి, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీవాసులు సుష్మిత, రోజా


ధర్నాలో పాల్గొన్న సుధీర్ రెడ్డి, విఠల్ రెడ్డి, మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి

పద్మిని, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వికాస్‌నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, శోభారాణి, విద్యుత్ నగర్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాసచారి, ద్వారకా పురం సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు ప్రసాద్, పవన్ సంతోష్, తులసికృష్ణ, గట్టు శ్రీను, రమణారెడ్డి, జలంధర్, కిరణ్, నరేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.